JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 288 07 ఆదివారం జూన్ 2026 ఎడిటర్ గుంటుపల్లి స్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

జనసైన్యం సిటి

రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.అదనపు డి జి పి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగారావు డిఎం రజనీకాంత్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ జిల్లా అధికారులు పాల్గొన్నారు.







## కాంగ్రెస్ నేతలకు లిఫ్ట్ గండం

జనసైన్యం సిటి

కరీంనగర్ కాంగ్రెస్ నేతలను వెంటాడుతున్న లిఫ్ట్ గండం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలువురు కాంగ్రెస్ నేతలు ఇటీవల కాలంలో ఆసుపత్రికి మరియు ఫంక్షణాలకు వెళ్లినప్పుడు లిఫ్ట్ తెగిపోయి కింద పడడంతో ప్రమాదం నుంచి బయటపడిన కాంగ్రెస్ నేతలు ఇటీవల కాలంలో లిఫ్ట్లో వెళ్లాలంటే భయపడిపోతున్నారు కరీంనగర్ లోని వన్ హాస్పిటల్లో సాక్షాత్తు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ ఆస్పత్రికి పరామర్శ కోసం లిఫ్టులో వెళ్లి తిరిగి వస్తుండగా లిఫ్ట్ వైర్ తెగిపడి పోవడంతో లిఫ్టులో నుంచి కిందపడిన మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడింది శనివారం కరీంనగర్లోని మాజీ శాసనసభ్యులు ఆరెపల్లి మోహన్ జన్మదిన సందర్భంగా కెమిస్ట్రీ భవన్ లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మానకొండూరు శాసనసభ్యులు కవంపల్లి సత్యనారాయణ లిఫ్టులో వెళ్లి వస్తుండగా లిఫ్ట్ తెగి కిందపడి పోయారు లిఫ్టులో ఇరుక్కున్న వారిని బయటికి తీయడం కోసం సిబ్బంది అనేక ఇబ్బందులకు గురైన ఎలాంటి గాయాలు కాకపోయినప్పటికీ తరచు లిఫ్ట్ ప్రమాదాలలో కాంగ్రెస్ నేతలు ఉండడం కలవరపెడుతుంది లిఫ్టులో వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు అయితే గతంలో వన్ హాస్పిటల్లో మంత్రికి ప్రమాదం జరిగినప్పటికీ హాస్పిటల్ పై ఎలాంటి చర్య తీసుకోలేదు అలాగే శనివారం కెమిస్ట్రీ భవన్ లో మానకొండూరు శాసనసభ్యులు సత్యనారాయణకు లిఫ్ట్ లో ప్రమాదం జరగడంతో లిఫ్టు ప్రమాదంపై విచారణ జరిపించాలని అలాగే మంత్రి ప్రమాదానికి గురైన హాస్పిటల్ పై కూడా విచారణ జరిపించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.







మల్లారెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు



ఆరెపల్లి మోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు



భాస్కర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

# సునీల్ రావు ఖబర్దార్

జనసైన్యం సిటి



కరీంనగర్ నగరంలోని 47వ డివిజన్‌లో గల మీకోసం కార్యాలయంలో.. బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ పైన తీవ్ర విమర్శలు చేశారు.కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కృషి ఫలితమేనని, గతంలో ఇదే విషయాన్ని పలుమార్లు చెప్పి ఇప్పుడు భిన్నంగా మాట్లాడుతున్న సునీల్ రావు ది అది నోరా మోరా అని ఘాటుగా విమర్శించారు.కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే తమ వైఖరిని ఎప్పటికప్పుడు మార్చుకుంటున్న ఊసరవెల్లి నాయకుడు అని అన్నారు.కేంద్ర మంత్రి సమక్షంలో కూడా స్మార్ట్ సిటీ విషయంలో వినోద్ కుమార్ పాత్రను ప్రస్తావించిన వీడియోలు ఉన్నాయని. అవి ప్రజలందరికీ తెలుసన్నారు. వ్యక్తిగత రాజకీయ లబ్ధి కోసం తన వైఖరిని మార్చుకుని ఇప్పుడు కేంద్ర మంత్రికి దగ్గర అవడం సిగ్గు చేటు అన్నారు. పార్లమెంట్‌లో కరీంనగర్ అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు తీసుకొచ్చామని చెబుతున్న నాయకులు ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే దేవాలయాలకు ప్రత్యేక నిధులు, నవోదయ విద్యాలయం, జాతీయ రహదారి పనులు, డంప్ యార్డ్ అభివృద్ధి వంటి అంశాలపై చేసిన హామీల అమలు గురించి ప్రశ్నించారు.కరీంనగర్‌కే కాకుండా ఇతర నగరాలకు కూడా కేంద్ర పథకాల ద్వారా నిధులు వచ్చాయని, వాటిని వ్యక్తిగత ఘనతగా చెప్పుకోవడం సరికాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడం, గ్రామాల్లో తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయన్నారు

కరీంనగర్ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు.తమ పార్టీపై ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు గట్టిగా ప్రతిస్పందిస్తారని హెచ్చరించారు. గతంలో బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను ఇప్పుడు మరిచిపోయి భిన్నంగా వ్యవహరిస్తున్న నాయకుడు ఎవరైనా ఉంటే అతనే, అవినీతి అనకొండ లఫంగి సునీల్ రావు అని ఘాటుగా విమర్శించారు.

## అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్న ఇంటర్మీడియట్ కళాశాలలను సీజ్ చేయాలి.

### ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్



జనసైన్యం సిటి




కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రవేశాలు చేపడుతున్న ర్యాంక్ ఫోర్డ్,గ్రావిటీ,బన్సల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిఐఈఓ కార్యాలయంలోని ఏవో సుధాకర్ గారికి అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది

అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావన్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాంక్ఫోర్డ్ గ్రావిటీ బన్సల్ కళాశాలలు విద్యాశాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా తప్పుడు ఫలితాలను ప్రచారం చేస్తూ బోర్డులు పెట్టి విద్యార్థులు వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవలసిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మిన్నకుండిపోవడం జిల్లా ప్రజలను ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు అదే విధంగా జిల్లాలోని ఫాలో ఇంటర్మీడియట్ కళాశాలలకు ఎలాంటి అనుమతులు లేకుండానే నిన్నటి రోజున రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ Resonance IIT, JEE, NEET వంటి గుర్తింపు లేని కళాశాలను ప్రారంభించడం సరైంది కాదని ఆ కళాశాల ప్రారంభించడంలో ఉన్న మతల భేంటో ఆ ఐపీఎస్ అధికారి విజ్ఞతకే వదిలేస్తామన్నారు జిల్లాలో కోకొల్లులుగా ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఉంటే జిల్లాలో ఉన్నటువంటి విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల ఇచ్చే డబ్బులకు కక్కుర్తి పడి యజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులు లేకుండానే కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు కళాశాల నడుస్తున్నప్పటికీ సంబంధిత విద్య శాఖ మంత్రి స్థానిక మంత్రులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు ఇకనైనా ఎటువంటి అనుమతులు లేని కళాశాలలు పాఠశాలను సీజ్ చేసి సంబంధిత యజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని యుగంధర్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చెంచాల మురళి పిన్నమల్ల భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ ఎన్.ఎస్.ఎస్ పాత్ర కీలకం



**జనసైన్యం సిటి**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "యువత నేతృత్వంలో వాతావరణ విపత్తు సంసిద్ధత" పై జాతీయ వెబినార్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 పురస్కరించుకొని "Youth-Led Climate Disaster Preparedness & Micro-Resiliencyμμ (యువత నేతృత్వంలో వాతావరణ విపత్తు సంసిద్ధత మరియు సూక్ష్మ-స్థితిస్థాపకత) అనే అంశంపై ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి వెబినార్ అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది.ప్రిన్సిపల్ మరియు ఎన్.ఎస్.ఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ కె. పద్మావతి మాట్లాడుతూ, విద్యాసంస్థలు విద్యార్థులలో పర్యావరణ స్పృహను పెంపొందించడంలో ముందుండాలని కోరారు. యువత ఆధునిక సాంకేతికతను వాడుకుంటూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా సంసిద్ధం కావాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని, ఇటువంటి జాతీయ వెబినార్ల ద్వారా విద్యార్థులలో సరికొత్త ఆలోచనలు, బాధ్యతాయుత ప్రవర్తన పెరుగుతుందని ఆమె ఆకాంక్షించారు.

ముఖ్య అతిథి ప్రసంగం:

హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలరని ఆయన కొనియాడారు. హరితహారం, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనలో యువత ముందంజలో ఉండాలని సూచించారు. వాతావరణ మార్పుల వల్ల సంభవించే విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, సమాజాన్ని చైతన్యపరచడంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

ముఖ్య వక్త ప్రసంగం:

కరీంనగర్ లోని ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (అటానమస్) అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతి ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ మార్పుల యుగంలో పర్యావరణ పరిరక్షణ కేవలం బాధ్యత మాత్రమే కాదు, తక్షణ అవసరమని స్పష్టం చేశారు. విపత్తు నిర్వహణలో యువత పాత్ర అత్యంత కీలకమని, స్థానిక వనరులను కాపాడుకుంటూ మైక్రో-రెసిలియెన్సీ (సూక్ష్మ-స్థితిస్థాపకత) ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

నిర్వాహకులు మరియు పాల్గొన్న ప్రముఖులు:

ఈ వెబినార్ విజయవంతం కావడానికి నిర్వాహకులు డాక్టర్ జి. నరసింహులు, డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, డాక్టర్ డి. సరిత, డాక్టర్ ఎం. మధుకర్ రావు మరియు డాక్టర్ డి. ప్రసన్న అహర్నిశలు శ్రమించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల విద్యాసంస్థల అధ్యాపకులు, కళాశాల అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, దేశవ్యాప్తంగా ఉన్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు మరియు వందలాది మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

# బడుగు, బలహీన వర్గాల ఆశాకిరణం ఆరేపల్లి మోహన్



**జనసైన్యం సిటి**

దళిత జననేత, మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎస్సీ సెల్ నాయకుడు మన ఆరేపల్లి మోహన్ అన్న కి జన్మదిన శుభాకాంక్షలు.బడుగు, బలహీన వర్గాల ఆశాకిరణం...అణగారిన ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే యోధుడు...పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు...సామాజిక న్యాయం, సమానత్వం కోసం అహర్నిశలు శ్రమించే మహోన్నత నాయకుడు.. ఆరేపల్లి మోహన్ అన్నకి జన్మదిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు.మీ నాయకత్వం మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండి నూరేళ్లు ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్ , అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి గోష్కి శంకర్ , అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సముద్రాల అజయ్ , ఎంఆర్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ




జన సైన్యం: శంకరపట్నం

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ గ్రామంలో ఉపాధి కూలీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ పుధరి.రాజు సూచించారు. శంకరపట్నం మండలంలోని మోలంగూర్ గ్రామ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్న మహిళా కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పని చేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొనారు.

# అరుణాచలం రేపిస్టులను కాల్చి పడేసిన విజయ్ ప్రభుత్వం





**జనసైన్యం సిటి**

అరుణాచలం లాంటి పుణ్యక్షేత్రంలో ఇలాంటి ఘటన జరగడం నిజంగా కలచివేసే విషయం. భక్తి, ప్రశాంతత, ఆధ్యాత్మిక అనుభూతి కోసం వేలాది మంది వెళ్లే గిరి ప్రదక్షిణ మార్గంలో ఓ యువతిపై దారుణం జరిగిందనే వార్త ప్రతి ఒక్కరినీ ఆవేదనకు గురి చేస్తోంది.హిందువుల విశ్వాసం ప్రకారం అరుణాచలం కేవలం ఒక పుణ్యక్షేత్రం కాదు, పరమశివుని సాక్షాత్కార స్థలం. అక్కడ గిరి ప్రదక్షిణ చేయాలంటే పూర్వజన్మ సుకృతం ఉండాలని ఎంతోమంది నమ్ముతారు. అలాంటి పవిత్ర ప్రదేశంలోనే మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారడం బాధాకరం.బాధితులు భక్తి భావంతో, ప్రశాంతత కోసం వెళ్లిన సమయంలో ఇలాంటి దారుణాన్ని ఎదుర్కోవాల్సి రావడం వారి జీవితాలపై తీవ్ర మానసిక ప్రభావం చూపుతుంది. నేరస్తులు చేసిన పని కేవలం చట్ట విరుద్ధం మాత్రమే కాదు, మానవత్వాన్ని సిగ్గుపడేలా చేసే ఘోరమైన చర్య.

ఈ ఘటనతో మరోసారి గిరి ప్రదక్షిణ మార్గంలో భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లక్షలాది మంది భక్తులు వచ్చే ప్రాంతాల్లో మరింత పోలీసు బందోబస్తు, అధునాతన సీసీ కెమెరాలు, రాత్రి పూట ప్రత్యేక గస్తీ వంటి చర్యలు తప్పనిసరిగా ఉండాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

నేరం ఎక్కడ జరిగినా ఖండించాల్సిందే. కానీ భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువైన పుణ్యక్షేత్రంలో ఇలాంటి సంఘటనలు జరగడం మరింత ఆందోళన కలిగించే విషయం. బాధితులకు న్యాయం జరగాలి, నిందితులు చట్టం ప్రకారం కఠిన శిక్షను ఎదుర్కోవాలి, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.పుణ్యక్షేత్రాలకు భక్తులు భయంతో కాకుండా భక్తితో వెళ్లే పరిస్థితిని కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. భద్రతపై రాజీ ఉండకూడదు.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.



**జనసైన్యం సిటి**

కరీంనగర్ నగరంలోని కె.ఈ.ఎస్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన 11వ వార్డు సభలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 11 డివిజన్ తో పాటు పలు వార్డు సభలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆకుల నరసన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నదన్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, వైద్య సేవలు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు.మహిళల ఆర్థిక సాధికారత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వడ్డీ లేని రుణాలను అందిస్తూ మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నారని చెప్పారు. మహిళల అభ్యున్నతి ద్వారానే కుటుంబాలు, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు కరీంనగర్ నగర అభివృద్ధిపైనా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని ఆకుల నరసన్న తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల కోసం భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వార్డు సభలో 11వ డివిజన్‌కు చెందిన ప్రజలు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కరీంనగర్ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద నూతన ట్రాఫిక్ ఔట్ పోస్ట్ బూత్ ప్రారంభం

**జనసైన్యం సిటి**



నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా కరీంనగర్ బస్టాండ్ ఇన్ గేట్ (In-Gate) వద్ద శనివారం నాడు నూతన ట్రాఫిక్ ఔట్ పోస్ట్ బూత్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో అత్యంత రద్దీగా ఉండే బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను అదుపు చేయడానికి, నిరంతరం పర్యవేక్షించడానికి ఈ నూతన ఔట్ పోస్ట్ బూత్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది ఎల్లప్పుడూ అలర్ట్‌గా ఉండాలని సూచించారు.సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ - కూలింగ్ గ్లాసెస్ పంపిణీ:కార్యక్రమంలో భాగంగా, భానుడి భగభగలకు సైతం వెరవకుండా రోడ్లపై నిలబడి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ప్రత్యేక కూలింగ్ గ్లాసెస్ (కళ్ళద్దాలను) సీపీ అందజేశారు. తీవ్రమైన ఎండల నుండి సిబ్బంది తమ కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. విధి నిర్వహణతో పాటు సిబ్బంది ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి గారితో పాటు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్-ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



కొండగట్టు, జనసైన్యం న్యూస్:
జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు చిన్న రాము, ముఖ్య అర్చకులు జితేందర్, పవన్‌లు వేదోక్త మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. దేవస్థాన ఈఓ ఎస్. అంజనారెడ్డి శేషవస్త్రాన్ని అందజేశారు.అనంతరం అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ, అటవీ, న్యాయ శాఖల మంత్రిగా సేవలందించిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి దర్శన కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు టెంపుల్ సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, అర్చకులుదేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం



**జనసైన్యం సిటి**

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందామని హిందూ సమ్మేళనం నిర్వహణ కమిటీ సభ్యులు అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో ఇటివల హిందూ సమ్మేళన కమిటీ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరగగా సమ్మెలనం నిర్వహకోసం సహకారాన్ని అందించిన దాతలకు జుట్ బ్యాగ్ లను పంపిణీ చేయగా కార్యక్రమం ను గ్రామ సర్పంచ్ తరి రామనుజం ప్రారంభం చేశారు.అనతరం ఇంటిటికీ వెళ్ళి దాతలకు అందచేశారు.పర్యవరణ రక్షణ కోసం ప్రతిఒక్కరు కృషి చేసి ప్లాస్టిక్ వినియోగంను తగ్గించి ఈచిన్న మార్పు రెపటీ తరం కు నాది కావలని సుచించారు.ఈకార్యక్రమంలో హిందూ సమ్మెలన సమితి అధ్యక్షుడు కోటగిరి అశోక్,గుమ్మల తిరుపతి, కోటగిరి రమేష్,అకు రాజేంధర్ ,రెడ్డవేన అజయ్,అంకతి భరత్ కుమార్, పుప్పాల వెంకటేష్,ఎడిపెళ్ళి మురళి,కోంపెల్లి రాజం,దోనికెన రాజేష్,పంచాయతీ కార్యదర్శి బలచందర్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో చెస్ క్రీడ పోటీలు



**జనసైన్యం సిటి**

**సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 50 రోజుల పాటు విజయవంతంగా చెస్ క్రీడా శిక్షణ తరగతులు చేపట్టారు. చెస్ క్రీడా కోచ్ కొప్పర్తి శివయ్య పర్యవేక్షణలో చెస్ తరగతులను రెండు విడతలలో నిర్వహించారు. చెస్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు, చిన్నారులకు శనివారం రోజున ముఖ్యఅతిథి 49 వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ బహుమతుల ప్రధానం చేశారు. చెస్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు కె.అవిష ( మొదటి), ఎన్ సాయి (రెండవ) , కార్తికేయ మూడో బహుమతి ని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రధానంగా వేసవి సెలవుల్లో పిల్లలను ప్రోత్సహించడానికి చెస్ క్రీడ పోటీలను, కూచిపూడి, భరతనాట్యం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని సనాతన హిందూ ధర్మా సేవా సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మ సేవా సమితి నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.**

# సురక్షిత, నాణ్యమైన ఆహారమే ఆరోగ్యానికి పునాది

డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి

(07 జూన్ "ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం" సందర్భంగా)



సురక్షిత ఆహారానికి కేంద్ర బిందువు వైజ్ఞానికశాస్త్రమే. సైన్స్ ద్వారానే కలుషిత ఆహారాన్ని గుర్తించడంతో పాటు దానికి సంబంధించిన వ్యాధులను నివారించడం జరుగుతోంది. ప్రమాదకర బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులు, విష రసాయనాలతో కలుషితమైన లేదా అసురక్షితమైన ఆహారం తినడం వల్ల ప్రతి ఏట 600 మిలియన్ల ప్రజలు దాదాపు 200 రకాల రోగాల బారిన పడడం కొనసాగుతున్నది. సురక్షిత ఆహారం ప్రాణాలను కాపాడుతుంది, జబ్బులను నివారిస్తుంది. అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో తీవ్ర ఆహార కొరత వేధిస్తున్న వేళ, కలుషిత ఆహారం ఆ పేదల పాలిట శాపంగా మారుతున్నది. సురక్షిత ఆహారం అందించడం వల్ల ప్రతి ఏట 4.2 లక్షల మందిని, అందులో 40 శాతం వరకు పిల్లల నిండు ప్రాణాలను కాపాడవచ్చుని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

**సురక్షిత ఆహారానికి వైజ్ఞానికశాస్త్రమే పునాది :**

సురక్షిత, కాలుష్య రహిత ఆహార పదార్థాల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస – ప్రపంచ ఆరోగ్య సంస్థ – ఆహార వ్యవసాయ సంస్థలు సంయుక్తంగా ప్రతి ఏట 07 జూన్ రోజున "ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం (వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ సురక్షిత ఆహార దినం ఇతివృత్తంగా "భారం నుండి పరిష్కారం వరకు – ప్రతి చోట సురక్షిత ఆహారం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. కలుషిత ఆహార సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన, అసురక్షిత ఆహారం ద్వారా అనారోగ్యాలు, ఆహార భద్రత పట్ల పలు సంస్థల ఏకీకరణ, కలుషిత ఆహార మూలాలను తెలుసుకొని నిరోధించడం, సురక్షిత ఆహారానికి మార్గాలను వివరించడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా వివరించడం జరుగుతుంది. కలుషిత ఆహారాన్ని గుర్తించి నివారించడం, కలుషిత ఆహార కారణ రోగాలను నియంత్రించడంతో మానవ ఆరోగ్యం సంరక్షించబడుతుంది. ఆహార పదార్థాలు కలుషితం కావడానికి మూలాలుగా వ్యవసాయ క్షేత్రాలు, మార్కెటింగ్ మార్గాలు, పర్యాటకం, ఆహార రవాణా, నిల్వ చేయడం, పంపిణీ, వంట పద్ధతులు, శుభ్రత పాటించకపోవడం, అపరిశుభ్ర నీటి వినియోగం, సరిగ్గా ఉడికించకపోవడం, తినే సమయాల్లో చేతులను శుభ్రం చేసుకోకపోవడం లాంటి ప్రధాన అంశాలు గుర్తించబడ్డాయి.

**కలుషితమైనది అసలు ఆహారమే కాదు :**

సురక్షిత ఆహారం కుటుంబ ఆరోగ్యానికి మూలం. అసురక్షితమైనది ఆహారమే కాదని, అది ఒక విషంతో సమానమని తెలుసుకోవాలి. అసురక్షిత ఆహారం రోగాలను, పేదరికాన్ని పెంచి పోషిస్తున్నది. ముఖ్యంగా యుద్ధాలు, సంక్షోభ ప్రదేశాల్లో అన్ని వయస్సుల అభాగ్యులు/వలసదారులు అసురక్షిత ఆహార విషవలయంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. ఈ గంభీరమైన సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వాలు, ఆహారాన్ని పండించే రైతులు, వ్యాపారులు, విద్యావంతులు, విద్యాలయ యువత, వినియోగదారులు, పంపిణీదారులు ఏకమై పోషకాహార నాణ్యతను కాపాడడానికి తగు చర్యలు తీసుకోవాలి. సురక్షిత, పోషక, చవకైన, నమ్మకమైన ఆహారాన్ని పొందడం ప్రతి పౌరుని కనీస మానవ హక్కు అని గుర్తుంచుకోవాలి. సురక్షిత నాణ్యమైన పోషకాహారానికి మూల సూత్రాలుగా శుభ్రత, సరిగ్గా వండడం, సురక్షిత నీటి వినియోగం, ఆహార పదార్థాల శుద్ధి, సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ ఉంచడం లాంటివి పేర్కొనబడ్డాయి.

వైజ్ఞానికశాస్త్రంలోని మైక్రోబయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, వాతావరణ వైజ్ఞానిక శాస్త్రం, సామాజిక వైజ్ఞానిక శాస్త్రం, సామాజిక శాస్త్రాల సమన్వయంతో ఆహార నాణ్యత, పోషక విలువలను కాపాడడానికి కృషి జరగాలి. ప్రతి ఒక్కరు తమ దినచర్యలో సురక్షిత ఆహారానికి తగు ప్రాధాన్యం ఇవ్వడం, చిన్న చిన్న చర్యలతో పెద్ద పెద్ద రోగాలకు అడ్డుకట్ట వేయడం జరగాలి. మన ఆరోగ్యం, మనం తీసుకునే ఆహార నాణ్యత పైననే ప్రధానంగా ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలి. మన ఆరోగ్యం, మన చేతుల్లోనే, చేతల్లోనే ఉంటుంది. ఎంత తింటున్నామన్నది ముఖ్యం కాదని, ఏం తింటున్నామన్నదే ప్రధానమని తెలుసుకుందాం. తినే రెండు ముద్దలు సుచిగా, రుచిగా, శుభ్రంగా, సురక్షితంగా ఉండే విధంగా జాగ్రత్త పడదాం. ఆహారాన్ని విషతుల్యం చేయకుండా వివిధ దశల్లో తగిన చర్యలు తీసుకుందాం. "మన సురక్షిత ఆహారమే మన సంపూర్ణ ఆరోగ్యం" అంటూ నినదిద్దాం.

## విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యం గా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన



**జనసైన్యం సిటి**

విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం' లక్ష్యం గా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన కొనసాగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు చేపట్టాల్సిన ప్రత్యేక సేవా, ప్రజాహిత కార్యక్రమాల కోసం శనివారం రోజున తిమ్మాపూర్ బిజెపి మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా నగర్ లోని శ్రీ తపాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణమండపంలో మండల బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విజయాలు , 12 ఏళ్ల ప్రగతినీ వివరించారు , పార్టీ నిర్ణయించిన ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. గడిచిన 12 ఏళ్లలో అవినీతి రహిత పాలన, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం పంపిణీ తో పాటు అనేక సంక్షేమ పథకాలు, చారిత్రక , సాహసోపేత బిల్లులు , అన్ని రంగాలలో దేశం సాధించిన ప్రగతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడానికి ప్రయత్నం చేయాలన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించాలి... చింతం శ్రీనివాస్.**

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి భవిష్యత్తు ఉంటుందని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిమ్మాపూర్ బిజెపి మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని అమ్మ పేరుతో ఓ మొక్కను నాటే కార్యక్రమం తిమ్మాపూర్ మండలంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో చేపట్టారు. మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక బిజెపి శ్రేణులు చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో చింతం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం కేవలం ఆర్థిక, సాంకేతిక రంగాలకే కాకుండా పర్యావరణ రక్షణకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చిందన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలకు బిజెపి శ్రీకారం చుట్టిందని, ఆ దిశలోనే'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడడానికి చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థం , గౌరవార్థం ఒక మొక్కను నాటాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండలాధ్యక్షుడు చింతం శ్రీనివాస్, , జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ , గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బోనాల మోహన్,కోయ్యడ శ్రీనివాసు,ఎర్రోజు లక్ష్మణ్,తమ్మనవేని రాజుయదవ్, బిజెవైయం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్ ,కానుగంటి మదుకర్ రెడ్డి,బుర్ర శ్రీనివాసు,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,రామిడి మహేందర్ రడ్డి,కన్నం సాయి, ఆంజనేయులు, జక్కోజు అనిల్,ఉప్పులేటి జీవన్,ప్రదీప్ రెడ్డి,వేల్పుల ఓదెలు,ఈశ్వర చారి, మల్లేశం,మదుసూదన్ రెడ్డి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, బిఎల్ఎ2 ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును

బుకింగ్ చేసుకోవాల్సిన

ఫోన్ నెంబర్

9246966660

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి

రాత్రి 10 గంటల వరకు






మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు


ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం






బాల ప్రసాద్ కి జన్మదిన శుభాకాంక్షలు



వీరమాధవకు జన్మదిన శుభాకాంక్షలు

# క్యాన్సర్ బాధితుల భవిష్యత్తుకు బాటలు వేద్దాం !

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

(07 జూన్ "జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం" సందర్భంగా)



ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి నుంచి కోలుకున్న అభాగ్యుల ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, దీర్ఘకాలిక సంరక్షణ గొడుగులు పట్టడానికి, క్యాన్సర్ వ్యాధిని జయించిన వారిని ప్రోత్సహించి సమాజంలో నిలపడానికి ప్రయత్నించే వేదికలుగా ప్రతి ఏటా జూన్ మాసం తొలి ఆదివారం, అనగా 07 జూన్ 2026 రోజు "జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం (నేషనల్ క్యాన్సర్ సర్వైవర్స్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. క్యాన్సర్ బాధితుల్లో చికిత్స పొందుతున్న వారు, చికిత్సతో నయం అయిన వారు, దీర్ఘ కాలంగా బాధ పడుతున్న వారు, చివరకు చనిపోయిన వారు వస్తారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన క్షణం నుంచి ఆ రోగుల జీవితాలు భయానకంగా మారుతున్నాయి. వ్యాధిని తొలి దశలో గుర్తించడం వల్ల 90 శాతం రోగులకు పూర్తి చికిత్స జరుగుతున్నది. చికిత్స పొంది బయట పడిన వారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు.

**తొలి దశలో రోగ నిర్ధారణ ప్రధానం :**

ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న మిలియన్ల క్యాన్సర్ బాధితులు పడిన వేదనలను అర్థం చేసుకుంటూ వారి భవిష్యత్తు ఆరోగ్యకర జీవితానికి దారులు చూపడం పౌర సమాజ బాధ్యత. క్యాన్సర్ నుంచి బయట పడి సాధారణ జీవితం గడపడం సులభమే అంటూ బాధితులకు ఆత్మవిశ్వాసం నింపడం మన కనీస కర్తవ్యం. క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో నిర్ధారణ పరీక్షలతో గుర్తించడం అతి ముఖ్యం. నిర్ధారించిన వెంటనే సరైన చికిత్సను అందించి, వారికి పూర్తిగా నయం చేయవలసిన బాధ్యత వైద్యులకే కాదు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉంటుందని గమనించాలి. క్యాన్సర్ వైద్య సిబ్బంది, రోగులు లేదా బాధితులు, సంరక్షకులకు సరైన అవగాహన, అపోహలను అడ్డుకోవడం, భవిష్యత్తు పట్ల సానుకూల దృక్పథం లాంటివి కల్పించాలి. పొగాకు, ఆల్కహాల్, కుటుంబ చరిత్ర, జన్యు సంబంధం, జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఆర్థిక సామాజిక స్థితి, పర్యావరణ కాలుష్యం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి సోకడం గమనిస్తున్నాం. క్యాన్సర్ బాధితుల చికిత్సలో భాగంగా సర్జరీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, కీమోథెరపీ, రేడియోషన్ థెరపీ లాంటివి అందుబాటులో ఉంటాయి.

**జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం-2026 ఇతివృత్తం:**

జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "క్యాన్సర్ నుంచి బయట పడి జీవించడం : బాధితులు, సంరక్షకులు, వైద్య సిబ్బంది సమన్వయాన్ని బలోపేతం చేయడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. క్యాన్సర్ బాధితుల భవిష్యత్తుకు కమ్యూనిటీలు, వైద్య విభాగాలు ఐక్యంగా ముందుకు సాగాలి. ప్రస్తుతం భారతదేశవ్యాప్తంగా 2.5 మిలియన్ల క్యాన్సర్ బాధితులు ఉండగా, ప్రతి ఏటా 7 లక్షలకు పైగా ఆ జాబితాలో చేరుతుండగా, దాదాపు 5.6 లక్షల రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. బాధితుల్లో దాదాపు 71 శాతం మంది వయస్సు 30 - 69 ఏండ్ల మధ్య ఉండగా, సాలీనా వీరిలో 4 లక్షల మంది చనిపోతున్నారు. భారతీయ పురుషుల్లో అధిపతులు నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ బాధితులు సగటున 49 శాతం మంది ఐదు ఏండ్ల పాటు బతుకుతున్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా నమోదు అవుతున్నాయి. పొగాకు సంబంధ క్యాన్సర్లు కూడా అధికంగా నమోదు అవుతున్నట్లు విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో పట్టణ మహిళలు అధికంగా ఉండడం విశేషం.

1988లో ప్రారంభమై నేడు 39వ వార్షికోత్సవం జరుపుకుంటున్న జాతీయ క్యాన్సర్ బాధితుల దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ బాధితులకు మాత్రమే కాకుండా వారి సంరక్షకులకు కూడా ఆసుపత్రులు, క్యాన్యర్ కేంద్రాలు, సామాజిక సమావేశాల్లో అవగాహన, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, రోగులకు బాసటగా నిలవడం, ధైర్యాన్ని నూరిపోయడం కొనసాగుతుంది.

# బాలబాలికల సంరక్షణ మనందరి సమిష్టి బాధ్యత



జనసైన్యం సిటీ

బాలబాలికలబ సంరక్షణ మనందరి సమిష్టి బాధ్యత కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మానకొండూర్ మండల కేంద్రంలోని కేఎస్ కన్వెన్షన్ లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బాల పంచాయతీపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం హ్యాండ్ బుక్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రత,సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పిల్లలపై జరుగుతున్న వివిధ రకాల దౌర్జన్యాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, ఆన్‌లైన్ వేధింపులు వంటి సమస్యలను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల హక్కులపై అవగాహన పెంపొందించడం ద్వారా వారి భవిష్యత్తును మరింత సురక్షితంగా తీర్చిదిద్దవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి పాఠశాలలో బాలల సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. బాలల అభిప్రాయాలకు విలువనిస్తూ, వారి ఆలోచనలకు వేదిక కల్పించేందుకు బాల పంచాయతీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. "బాలల హక్కుల పరిరక్షణకు, వారిలో నాయకత్వ వికాసానికి 'ఇదొక అద్భుతమైన వేదిక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు తమ గ్రామం, పాఠశాల, కుటుంబం, సమాజ పరమైన సమస్యలను స్వయంగా గుర్తించడమే కాకుండా ఆయా సమస్యలపై చర్చించి పరిష్కారాలను వెతకడం అద్భుతమని ఆయన పేర్కొన్నారు. ఆలోచనా శక్తిని, దృక్పధాన్ని విస్తృతపర్చుకోవడం వారిలో ఆత్మవిశ్వాసం మెండుగా పెరుగుతుందన్నారు. ఆరోగ్యం, విద్య, బాలల రక్షణ వంటి కీలక అంశాలపై పిల్లలు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు.విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై కూడా పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని, సాంకేతికత వినియోగంలో జాగ్రత్తలు పాటించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు.కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, రక్షణ అంశాలపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు.

**లిమహిళల,బాలిక భద్రతే మా బాధ్యత : సీపీ గౌష్ ఆలం**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ మహిళలు, బాలల భద్రత కల్పించడమే తమ బాధ్యత అని, అందుకే జిల్లా పోలీసు శాఖ మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో బాలికలను రక్షించేందుకు వినూత్న కార్యక్రమాలు ఇప్పటికే చపట్టామని, అందులో భాగంగానే 'స్నేహిత' అనే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా 'సీక్రెట్ బాక్స్' లను ఏర్పాటు చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశించామని సీపీ తెలిపారు.

విద్యార్థినులు తమకు ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా, వేధింపులనైనా ఈ సీక్రెట్ బాక్సుల ద్వారా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, ఈ బాక్సులకు తాళాలు వేసి ఉంచుతామని, వాటి తాళం చెవులు మహిళా కానిస్టేబుళ్ల ఆధీనంలోనే ఉంటాయని,ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులు ఎదురైనా అధైర్యపడకుండా తక్షణమే షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. బాధితులు నేరుగా కాకుండా మొబైల్ నంబర్ 8712670759 ద్వారా వాట్సాప్ లేదా కాల్ చేసి ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అందు వల్ల నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని సీపీ పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పర్వీన్, ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్లు శ్రీలత, పుల్లయ్య, రమేష్‌లతో పాటు షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగానికి చెందిన సభ్యులు, మహిళలు, బాలలు తదితరులు పాల్గొన్నారు.



## జనార్ధన్ కు జన్మదిన శుభాకాంక్షలు



## దామెర సత్యం కు జన్మదిన శుభాకాంక్షలు

## విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముందు విద్యుత్ పెన్షనర్ లు ధర్నా



జనసైన్యం సిటి

కరీంనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముందు విద్యుత్ పెన్షనర్ లు ధర్నా నిర్వహించారు 70మంది పెన్షనర్ లు పాలుగోన్నారు ఈరోజు వరకు పెన్షన్ రాలేదు విద్యుత్ సంస్థ లో పనిచేసే సిబ్బంది కీ జీతాలు వచ్చినవి పెన్షనర్ లకు పెన్షన్ మాత్రం రాలేదు మేనేజ్ మెంట్ కక్ష సాధింపు చేర్యలు మానుకోవాలి విజ్ఞప్తి చేసారు వివిధ డిమాండ్లతో ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ నల్ల బ్యాడ్జ్ లతో నిరసన తెలిపినారు విద్యుత్ సౌదా హైదరాబాద్ లో వివిధ పెన్షనర్ అసోసియేషన్ లు మేనేజ్ మెంట్ట్రాన్సకో జెనకో లకు మెమోరాండం నిన్న పెన్షన్ విడుదల చెయ్యాలి అని సమర్పించినరు ఈ కార్యక్రమం లో  మర్రిపెల్లి మహేందర్ విద్యాసాగర్ రావు రాజన్న దేవేందర్  మొండయ్య నారాయణ మొహన్ నాగభూషణం మొదలగు వారు పాల్గొన్నారు.

# ఇకపై " దేశ ఆహార భద్రత" అదానీ చేతుల్లో - బలిపశువు కానున్న ఎఫ్.సీ.ఐ.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్

భారతదేశంలో ఆహార భద్రత గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చే సంస్థ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ). దేశంలో కోట్లాది మంది పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, గోధుమలు అందించడంలో, రైతులకు కనీస మద్దతు ధర వ్యవస్థను అమలు చేయడంలో, కరవు లేదా అత్యవసర పరిస్థితుల్లో ధాన్య నిల్వలను నిర్వహించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించింది. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ఆకలి, ఆహార కొరత వంటి సమస్యల నుంచి బయటపడటానికి ఎఫ్‌సీఐ ఒక ప్రధాన ఆధారంగా నిలిచింది.

అయితే గత కొన్నేళ్లుగా ఎఫ్‌సీఐ పాత్ర, దాని స్వతంత్ర సామర్థ్యం, మౌలిక సదుపాయాల భవిష్యత్తు గురించి తీవ్రమైన చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ధాన్య నిల్వల కోసం నిర్మిస్తున్న ఆధునిక సైలో ప్రాజెక్టుల కేటాయింపులో కొద్ది ప్రైవేటు సంస్థలు ఆధిపత్యం సాధించడం అనేక ప్రశ్నలకు దారితీస్తోంది. ఒకవైపు ప్రభుత్వం ఆధునికీకరణ, నిల్వ నష్టాల తగ్గింపు, సామర్థ్య పెంపు పేరుతో ఈ ప్రాజెక్టులను సమర్థిస్తుండగా, మరోవైపు రైతు సంఘాలు, ఆర్థిక నిపుణులు, ప్రతిపక్షాలు మాత్రం ఇది ప్రభుత్వ రంగ సంస్థలను క్రమంగా బలహీనపరచి ప్రైవేటు గుత్తాధిపత్యాలకు మార్గం సుగమం చేసే ప్రక్రియగా అభివర్ణిస్తున్నాయి.

భారతదేశంలో ప్రతి సంవత్సరం వందల మిలియన్ టన్నుల ఆహార ధాన్యం ఉత్పత్తి అవుతోంది. కేంద్ర ప్రభుత్వం కోట్లాది టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తుంది. ఇంత పెద్ద వ్యవస్థలో నిల్వ సదుపాయాలు అత్యంత కీలకమైనవి. ఒకప్పుడు ప్రభుత్వ గోదాములే ప్రధాన ఆధారంగా ఉండేవి. ఇప్పుడు ఆధునిక సైలోల నిర్మాణం వేగంగా పెరుగుతోంది. సాంకేతికంగా సైలోలు మెరుగైన నిల్వ పద్ధతే అయినప్పటికీ, ప్రశ్న సాంకేతికత గురించి కాదు; ఆ సదుపాయాల యాజమాన్యం, నియంత్రణ ఎవరి చేతిలో ఉంది అన్నదే అసలు ప్రశ్నగా మిగిలింది. విపక్షాలు, ఇతర విమర్శకులు ప్రస్తావిస్తున్న ప్రధాన అంశం ఏమిటంటే, భారీ సామర్థ్యం కలిగిన నిల్వ ప్రాజెక్టులు కొద్ది సంస్థల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయన్నది.

మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో పోటీ ఉండటం సహజం. కానీ పోటీ పేరుతో చివరికి అతి కొన్ని కంపెనీలు మాత్రమే అన్ని కీలక కాంట్రాక్టులను పొందితే, అది పోటీ కాకుండా కేంద్రీకరణగా మారుతుంది. దీర్ఘకాలంలో అలాంటి పరిస్థితి ఏర్పడితే ప్రభుత్వానికి ప్రత్యామ్నాయాలు తగ్గిపోతాయి. ప్రభుత్వ అదుపు కోల్పోతే ప్రజలు ఆహార భద్రతకు ముప్పు వాటిల్లినట్లే. ఒకసారి మౌలిక సదుపాయాలు ప్రైవేటు రంగ ఆధీనంలోకి వెళితే, భవిష్యత్తులో విధాన




నిర్ణయాలపై కూడా వాటి ప్రభావం పెరిగే అవకాశం ఉంటుంది.146 కోట్ల ప్రజలకు అతి ప్రధానమైన తిండిగింజల లోటు ఏర్పడుతుంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అదుపులో ఉండాల్సిన ప్రధాన సంస్థ మార్కెట్ శక్తులకు శక్తుల చేతుల్లో ఉంచడం ప్రమాదకరం. ముఖ్యంగా విపత్కర పరిస్థితుల్లో అవి కేంద్ర ప్రభుత్వానికి సహకరించకపోతే ఈ దేశ ప్రజలు ఏమై పోవాలి?

ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐ పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. గత దశాబ్దంలో ఈ సంస్థపై భారీ ఆర్థిక భారం పడింది. ఆహార సబ్సిడీ బకాయిలు, అప్పులు, నిర్వహణ ఖర్చులు పెరిగాయి. ఒకప్పుడు దేశ ఆహార భద్రతకు ప్రతీకగా ఉన్న సంస్థ ఇప్పుడు తన స్వంత మౌలిక సదుపాయాలను విస్తరించుకోవడం కంటే ప్రైవేటు సదుపాయాలపై ఆధారపడే దిశగా నెట్టబడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయకుండా, వాటి పనులను క్రమంగా ప్రైవేటు రంగానికి అప్పగించి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటే ...దీర్ఘకాలంలో ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఈ చర్చలో మరో ముఖ్యమైన అంశం భూమి కేటాయింపులు. అనేక రాష్ట్రాల్లో పెద్ద ప్రాజెక్టుల కోసం ప్రైవేటు సంస్థలకు తక్కువ ధరలకు లేదా ప్రత్యేక రాయితీలతో భూములు ఇవ్వడం వివాదాలకు దారితీసింది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇవ్వడం కొత్త విషయం కాదు. కానీ అదే సమయంలో చిన్న రైతులు, చిన్న పరిశ్రమలు, సహకార సంస్థలకు అలాంటి అవకాశాలు లభిస్తున్నాయా అనేదే అసలు ప్రశ్న కూడా తలెత్తుతోంది. అభివృద్ధి ఫలితాలు కొద్ది సంస్థలకే పరిమితమైతే, ప్రజల్లో అసంతృప్తి పెరగడం సహజం.

ఆహార భద్రత అనేది కేవలం ధాన్యం నిల్వ చేసే సాంకేతిక అంశం మాత్రమే కాదు. అది దేశ సార్వభౌమాధికారంతో ముడిపడి ఉన్న వ్యూహాత్మక రంగం. విద్యుత్, రక్షణ, నీటి వనరుల మాదిరిగానే ఆహార నిల్వలు కూడా కేవలం అంటే కేవలం ప్రజా ప్రయోజనాల కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల పాత్రను పూర్తిగా తగ్గించడం కంటే, వాటిని ఆధునికీకరించి మరింత సమర్థవంతంగా మార్చడం ప్రజా ప్రయోజనాలకు అనుకూలమైన మార్గం కావచ్చు.

ప్రభుత్వం వాదిస్తున్నట్లుగా ఆధునిక సైలోలు అవసరమే కావచ్చు. నిల్వ నష్టాలను తగ్గించడం కూడా అవసరమే. కానీ ఈ ప్రక్రియలో పారదర్శకత, సమాన పోటీ, ప్రజా పర్యవేక్షణ తప్పనిసరి. లేకపోతే ప్రభుత్వ రంగం బలహీనపడుతూ, ప్రైవేటు ఆధిపత్యం పెరుగుతూ, చివరికి దేశ ఆహార వ్యవస్థపై కొద్దిమంది ప్రభావం పెరిగే ప్రమాదం ఉంది. ఆహార భద్రతను మార్కెట్ లాభనష్టాల కోణంలో మాత్రమే చూడలేం. అది కోట్లాది ప్రజల జీవన హక్కుతో ముడిపడి ఉన్న అతి ముఖ్యమైన అంశం

ఎఫ్‌సీఐని బలహీనపరచడం కాదు, బలోపేతం చేయడమే దేశ ప్రయోజనాలకు అనుకూలం. ప్రభుత్వ రంగ మౌలిక సదుపాయాలను విస్తరించడం, ఆధునిక సాంకేతికతను ప్రభుత్వ యాజమాన్యంతోనే అమలు చేయడం, ధాన్య నిల్వలపై ప్రజాస్వామ్య నియంత్రణను కొనసాగించడం అత్యవసరం. ఎందుకంటే ఆహార భద్రతపై నియంత్రణ కోల్పోయే దేశం, తన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కూడా క్రమంగా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ప్రజల డబ్బుతో నిర్మించిన వ్యవస్థలు ప్రజల కోసమే పనిచేయాలనే సూత్రాన్ని మరవకపోవడం నేటి అత్యవసర అవసరం.

# ఆ పీరియడ్‌కి సైతం ఈల్ ప్రిజర్వ్ చేయాలి!



మానేటి ప్రతాపరెడ్డి.

**జనసైన్యం సిటి**

సర్వీస్ పీరియడ్‌కి హాఫ్ పే లీవ్ (హెచ్‌పీఎల్), డ్యూటీ పీరియడ్‌కి ఎర్న్‌డ్ లీవ్ (ఈల్) ప్రిజర్వ్ చేయాలని లీవ్ రూల్స్ నిర్దేశిస్తున్న విషయం తెలిసిందే. అయితే, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అసలు విధులు నిర్వర్తించకపోయినా... ఉద్యోగంలోనే లేకపోయినా హెచ్‌పీఎల్‌తో పాటు ఈల్ కూడా ప్రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. ఆ పరిస్థితులేంటో చూద్దాం. కొంత మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు కొత్తగా జాబ్‌లో చేరిన తర్వాత కొన్ని సందర్భాల్లో పూర్వ తేదీ నుంచి తమకు సీనియారిటీ ఇవ్వాలనీ, వేతనం కూడా చెల్లించాలనీ ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుంటారు. ప్రభుత్వం తిరస్కరిస్తుందని తెల్సి కూడా దరఖాస్తు పెట్టుకోవాల్సిందే. దరఖాస్తు చేయకుండా నేరుగా కోర్టుకి వెళ్తే సంబంధిత అధికారులకు ముందుగా దరఖాస్తు పెట్టుకో అని కోర్టు చెప్పే అవకాశం ఉంది. అయితే, ప్రభుత్వం సదరు దరఖాస్తులను సహజంగానే పట్టించుకోదు. లేదా అధికారులు స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేస్తూ... అలా ముందు తేదీ నుంచి సీనియారిటీ కల్పించడం, వేతనం చెల్లించడం కుదరని తేల్చి చెపుతారు. దాంతో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులు అనివార్యంగా కోర్టును ఆశ్రయిస్తారు. కోర్టు బాధితులకు అనుకూలంగా ఆర్డర్స్ ఇచ్చినప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఆ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముందు తేదీ సీనియారిటీ కల్పించి, వేతనం కూడా చెల్లిస్తుంది. ఇలా వేతనం చెల్లించిన పీరియడ్ మొత్తం డ్యూటీగా పరిగణించారని స్పష్టమవుతున్నది కదా! ఇలా వేతనం చెల్లించిన పీరియడ్‌కి సైతం హెచ్‌పీఎల్‌తో పాటు ఈల్ కూడా విధిగా నిల్వ చేయాల్సి ఉంటుంది. ఒక ఉదాహరణ: 2009లో ఉద్యోగం చేరిన 2002 ఉూజ హిందీ భాషాపండిట్లకు 2002 అక్టోబర్ నుంచి సీనియారిటీ కల్పించి, వేతనం చెల్లించాలని పేర్కొంటూ గౌరవ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఈ మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది కదా! దీంతో ఆ టీచర్లకు ఎట్టకేలకు న్యాయం జరిగింది. పైగా, వాళ్లకు ట్రిపుల్ ధమాకా! సర్వీస్ దాదాపు ఏడేళ్లు పెరిగింది, సీపీఎస్ నుంచి ఓపీఎస్ పరిధిలోకి వచ్చారు, వాళ్లందరికీ 2002 అక్టోబర్ నుంచి హెచ్‌పీఎల్, ఈల్ పొందడానికి అర్హత వచ్చింది. వారందరికీ ఇప్పుడు హెచ్‌పీఎల్, ఈల్ నిల్వ చేయాల్సిందే. ఈ సందర్భంగా ఈ టీచర్లందరికీ మరోసారి అభినందనలు తెలియజేస్తున్నా. వీరికి హెచ్‌పీఎల్, ఈల్ నిల్వ చేయడంలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వారికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నాను ఫ్రెండ్స్.

# ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు

జనసైన్యం సిటి



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి, ములరాంపూర్, బర్దిపూర్,వేములకుర్తి ,వర్షకొండ గ్రామలలో శనివారం గ్రామసభలు ప్రత్యేక అదికారులు నిర్వహించారు. వేములకుర్తి గ్రామంలో తహశీల్దార్ వరప్రసాద్, వర్ష కొండ గ్రామం లో ఎంపిడివో సి హెచ్ గణేష్ , ఎర్దండి మూలరాంపూర్ గ్రామంలో ఎం పి ఓ రామకృష్ణ రాజు , బర్దిపూర్ గ్రామం లో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ లు గ్రామ సభలలో పాల్గొన్నారు. వర్షాకాల సన్నద్ధత,సురక్షిత త్రాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణల వన సంరక్షణ,మొక్కల పెంపకం వనమహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, వరద నివారణ చర్యలు వంటి వదలకు అంశాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పోనకంటి చిన్న వెంకట్, తరి రామానుజం, కల్లెడ గంగాధర్, సంగం అమృత, కానుగంటి లాస్య ప్రియ, పంచాయతీ కార్యదర్శులు నిరోషా, ప్రసాద్, దివాకర్, బాలచందర్, దౌడ ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచులు బర్మ మల్లయ్య,భీంఖర్ అఖిల్, రాజరెడ్డి, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కృషిని జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ విమర్శలు



కొడిమ్యాల, జనసైన్యం న్యూస్

కరీంనగర్--జగిత్యాల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-563)ను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో, ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు కొడిమ్యాల మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పేరుక శ్రవణ్ కుమార్ హాజరై మాట్లాడారు.కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని, ఈ ప్రాజెక్టు సాధనలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక పాత్ర పోషించడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు.జగిత్యాల-కరీంనగర్ రహదారి సమస్య దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తోందని, గతంలో కరీంనగర్ ఎంపీలుగా పనిచేసిన కె. చంద్రశేఖర్ రావు, బోయినపల్లి వినోద్ కుమార్ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.బండి సంజయ్ చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయించారని తెలిపారు.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.ప్రజల ప్రయోజనాల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతించాల్సిందిపోయి రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు.తెలంగాణలోని ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.7,597.16 కోట్లు కేటాయించిందని, ఇందులో జగిత్యాల-కరీంనగర్ సెక్షన్‌కే రూ.2,395 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.సుమారు 58 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారిని బీఓటీ విధానంలో నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయనున్నారని చెప్పారు.అలాగే జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను తప్పిస్తూ 34.96 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు.గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించేలా ఈ రహదారిని రూపకల్పన చేస్తున్నారని తెలిపారు. రహదారి విస్తరణ పూర్తయితే జగిత్యాల--కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.ఈ ప్రాజెక్టు పీఎం గతిశక్తి పథకం కింద అమలవుతుండటంతో కరీంనగర్,జగిత్యాల జిల్లాల సామాజిక,ఆర్థికాభివృద్ధికి,వ్యాపార రంగం.రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.

# జీవ కోటికి సముద్ర జలమే జీవనాధారం

## (జూన్ 8 న ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా)



నేదునూరి కనకయ్య

మానవుడు నివసించే భూగ్రహంపై 29 శాతం మాత్రమే భూమి ఉన్నది.71 శాతం సముద్రము నీరు వుంది మిగిలినదంతా సముద్రపు నీటి ద్వారా ఆవరించబడి ఉంది. ఈ గ్రహంలో జీవులన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా సముద్రాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. కడలిని కాపాడుకోవడం అందరి బాధ్యత. జీవరాశికి రక్షణ ఆహార పంటలు పారిశ్రామిక అభివృద్ధికి అవసరమవు జలవనరులను సమకూర్చే సముద్రాలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి .విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించి కడలిలో పడేస్తున్నారు. మనుషుల స్వార్థం పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు సముద్రంలో కలవడం వల్ల సముద్రం నీరు కాలుష్యం మై సముద్రంలో ఉన్న జీవులు అంతరించిపోతున్నాయి. సాగర జలం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయన్న విషయాన్ని ప్రభుత్వాలు ప్రజలు విస్మరించడం పట్ల పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సముద్రాలకు ఉన్న ప్రాముఖ్యత గుర్తించి మానవ వనరుల వికాసంలో సముద్ర వనరుల పాత్ర గురించి ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తుంది.

ప్లాస్టిక్ల వ్యర్థాలు 'డ్రైనేజీ 'చెత్త పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు సముద్రాలలో విచ్చల విడిగా పడేస్తున్నారు . అనేక దేశాలు పారిశ్రామిక వ్యర్థాలను నౌకలలో తరలించి సముద్రాల్లో పడేస్తున్నారు. వేల కొద్ది టన్నుల చెత్త సముద్ర గర్భంలో కలిసిపోయి కాలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి. సముద్రాలలో పడేసిన ప్లాస్టిక్ భూమిలో కరగక ఈ ప్లాస్టిక్ కాలుష్యకారకంగా తయారై సముద్రంలో ఉన్న చేపలు ఇతర జీవరాసులు అంతరిస్తున్నాయి.

జల కాలుష్యం అంతరిస్తున్న జీవరాశులు

నీటి కాలుష్యం వల్ల జీవజాతులు అంతరించిపోవడం వల్ల జీవావరణం పర్యావరణం దెబ్బతింటుంది. సముద్రాలను రక్షించే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు ఉదాసీనత ను నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాయి. ప్రభుత్వాల చర్యలు తుతు మంత్రంగా వుండడం గమనార్హం సముద్ర రక్షణ దినోత్సవం రోజు ప్రభుత్వాలు సముద్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు ప్రపంచ సముద్ర దినోత్సవం పురస్కరించుకొని ఐక్యరాజ్యసమితి 45 దేశాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తుంది. బ్రెజిల్ లోని రియో డిజనిరో నగరంలో 1992 ఐక్యరాజ్యసమితి సముద్రాలపై అవగాహన పెంచడానికి సదస్సును నిర్వహించింది 2008లో తొలిసారిగా ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహించింది .

**2026 సం" అంతర్జాతీయ థీమ్**

(పునః కల్పన మనకు తెలిసిన ప్రపంచానికి ఆవల మన మహా సముద్రంతో ఒక నూతన సంబంధం)

ఈ థీమ్ కేవలం సముద్రాలను వనరులుగా చూడటం ఆపి వాటితో గౌరవప్రదమైన బాధ్యతాయుతమైన బంధాన్ని ఏర్పరుచుకోవాలని పిలుపునిస్తుంది. అలాగే ఈ ఏడు సముద్ర రక్షణ ప్రాంతాలను బలోపేతం చేయాలని స్పష్టం.చేస్తుంది.

కలుషితమౌతున్న నీరు

ప్రభుత్వాలు 'పౌర సమాజం సముద్ర జలాల రక్షణను విస్మరిస్తునాయి. సముద్రపు నీరు కలుషితానికి గురి అవుతుంది. చాలా దేశాల్లో వ్యర్థాలను సముద్రంలో కలుపుతున్నారు

సముద్రాల వల్ల అనేక రకాల ప్రయోజనాలు పర్యావరణం రక్షించబడుతుంది. బీచ్ లో వంటి నీటి వనరుల చుట్టు మన అజాగ్రత్త వల్ల కాలుష్యం పెరిగిపోతుంది దీంతో సముద్రంలోని అనేక వేల జీవరాశులుమరణిస్తున్నాయి .ప్రకృతి విపత్తులు జరిగే అవకాశం ఉంది ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించడం సముద్రాల సుస్థిర అభివృద్ధి ద్వారానే ఆర్థిక



వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధనకు కృషి చేసే విధంగా సదస్సులు చర్చలు సమావేశాలు ర్యాలీలు నిర్వహిస్తారు.

**సముద్రం నీరు ప్రాముఖ్యత**

ప్రాముఖ్యత సముద్రం కనీసం 50% ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుందని ఐక్యరాజ్యసమితి డాటా తెలుపుతుంది. మహా సముద్రాలు 30% కంటే ఎక్కువ కార్బన్డయాక్సైడ్ ను గ్రహిస్తాయని ఇవి గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తగ్గిస్థాయిని రుజువు చేసింది. చెత్త 'మురుగు 'చమురు' లీకేజీ అవకాశం ఉంది ఈ విషయాల పట్ల ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలి. ముందు జాగ్రత్త లు తీసుకునేట్లు చైతన్య పరచడం.

**కలుషిత మౌతున్న సముద్రాలు**

సముద్రాలు ప్రపంచంలో కోట్లాది మందికి జీవనోపాధిని పౌష్టికాహారం అందిస్తూ జీవరాశుల మనుగడకు దోహద పడుతున్నాయి. ప్రపంచ పటంలో 3 వంతులకు పైగా సముద్రాలు విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ కాలక్రమేనా అవి కాలుష్యం బారిన పడుతున్నాయి. మానవుడు సముద్ర జలాలను కలుషితం చేస్తూ సముద్ర జీవుల మనుగడకు ముప్పు ఏర్పడే విధంగా వ్యవహరిస్తున్నాడు.

**సామాజిక ఆర్థిక వేత్తల ఆందోళన**

ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుంది. ప్లాస్టిక్ సంచులు ఇతర వస్తువులు పర్యావరణానికి హాని చేస్తున్నాయని అందరికీ తెలిసిన వాటి వినియోగాన్ని నియంత్రించడానికి సమగ్రమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోకపోవడం పౌరుల్లో ప్లాస్టిక్ వల్ల వచ్చే ప్రమాదాల గురించి అవగాహన లేకపోవడం ప్లాస్టిక్ వినియోగంలో ప్రపంచ మానవాళి తాను కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుకునట్టుగా వ్యవహరిస్తున్నారని సామాజిక ఆర్థిక శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ శరీర నిర్మాణంలో ప్రోటిన్లు కీలకపాత్ర వహిస్తాయి. అలాంటి ప్రోటీన్లను అందజేసే సత్తా ఒక సముద్ర జీవులకే ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం సముద్రాలలో ఐదు ట్రిలియన్ మైక్రో ప్లాస్టిక్ ఉన్నాయని వీటిని సముద్ర జీవులు( చేపల వంటివి) మింగడం వాటిని మనం ఆహారంగా తీసుకోవడంతో పలువురు క్యాన్సర్ల పాడిన పడుతున్నారని వైద్య ఆరోగ్యసర్వేలు తెలియజేస్తున్నాయి. 2025 సంవత్సరం నాటికి సముద్రాలలో ప్లాస్టిక్ చేపుల నిష్పత్తి ఒకటి నిష్పత్తి1:3 గా ఉంటుందని అంచనాలు తెలుపుతున్నాయి అనేక దేశాలు వ్యర్థ జలాలను సముద్రంలోకి విచక్షణ రహితంగా వదులుతున్నాయి త్వరలో విశ్వవ్యాప్తంగా సముద్రంలో కలుస్తున్న డ్రైనేజీ వాటర్ లో 70% శుద్ధి చేయ నంధున సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి .సముద్ర వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. దీనివల్ల ప్రతి ఏటా 13 మిలియన్ డాలర్ల నష్టం జరుగుతుంది. అని యు 'ఎన్' ఇ' పి అంచనా వేసింది .

**ప్లాస్టిక్ వ్యర్థాల్లో భారత్ అగ్రస్థానం**

ప్లాస్టిక్ వ్యర్థాలనుసముద్ర జలాల్లో పారవేస్తున్న దేశాల్లో భారత్' చైనా వాళ్లు ముందు వరసలో ఉండటం శోచనీయం. మన దేశంలో సాలీన ప్లాస్టిక్ వియోగం 15 మిలియన్ టన్నులు ఇది 2050నాటికి 20 మిలియన్ల టన్నులు అవుతంది. 2050 నాటికి సముద్ర జలాల్లోని ప్లాస్టిక్ వస్తువులను తొలగించక పోతే సముద్రాల్లో ఉండే చేపల బరువు కన్నా ప్లాస్టిక్ వ్యర్థాల బరువు ఎక్కువ ఉంటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో పశ్చిమబెంగాల్లో రోడ్ల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు. వీటిపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది మనకన్నా అభివృద్ధిలో ఆర్థికంగా వెనకబడిన దేశాలైన బాంగ్లాదేశ్ రువాండా 'కీన్యాయలో ప్లాస్టిక్ బ్యాగుల తయారీ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాయి. ఇకనైనా సముద్ర జలాల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలను వదలడం ఆపకపోతే చేపల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువ ఉండే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ వినియోగం మీద నిషేధం విధించాలి. పర్యావరణ హితకరమైన వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి.ప్రభుత్వాలు ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అమలు చెయ్యాలి. ప్రకృతి పర్యావరణ రక్షణకు సముద్రాల రక్షణకు సమగ్రమైన చట్టాలు రూపొందించి అమలు చెయ్యాలి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కడలిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమౌతుంది అన్న వాస్తవాన్ని గ్రహించి సముద్ర జలాలను కాలుష్యం కాకుండా తక్షణ కార్యాచరణ ప్రణాళిక లను అమలు చెయ్యాలి. పౌరసమాజం ' మహిళా 'యువజన సంస్థలు సామాజిక సేవా సంస్థలుసముద్ర జలాల రక్షణ వినియోగం ప్రయోజనాల మీద ప్రజలకు అవగాహన కలిగించాలి. సముద్రాలు బాగుండాలి జీవులు బాగుండాలి అనేది నినాదం కాకుండా ప్రభుత్వాల విధానం కావాలని ఆశిద్దాం.

## సన్న వడ్ల సాగుతో రైతులకు ఆర్థిక పురోభివృద్ధి



**జనసైన్యం సిటి**

సన్నవడ్ల సాగుతో రైతులు సంపన్నులవుతారని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ లు అన్నారు. స్టడీ టూర్ లో భాగంగా కర్ణాటక రాష్ట్రం హుబ్లీ నియోజకవర్గంలో ఉన్న మార్కెట్ యార్డును విస్తీర్ణన 430 ఎకరాల విస్తీర్ణ గల మార్కెట్ యార్డును శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, రైతులు సందర్శించారు. సందర్శనలో భాగంగా మార్కెట్ యార్డ్ ను పరిశీలించి, అక్కడి రైతులతో, అధికారులతో మాట్లాడి ఇక్కడ పండించే పంటలు సోయాబీన్, ఉల్లిగడ్డ, ఆలుగడ్డ ఆల్ వెరైటీ వెజిటేబుల్స్ వంటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, ప్రజా పాలనతో రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ముఖ్యంగా రైతులను సంపన్నులను చేయడంలో భాగంగా మార్కెట్ లో అధిక డిమాండ్ ఉన్న సన్నవడ్ల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు, సన్నాలు పండించిన రైతులకు బోనస్ సైతం చెల్లిస్తున్నట్లు తెలిపారు. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఆది శ్రీనివాస్ గారి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకువెళ్తుందని, వారి ఆదేశాల మేరకు వచ్చిన కర్ణాటక స్టడీ టూర్ లో భాగంగా ఇక్కడి పంటలు, కొనుగోలు వివరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని, తాము పరిశీలించిన అంశాలను తమ ప్రాంతంలోని రైతులకు క్షుణ్ణంగా వివరించి వేములవాడ నియోజకవర్గ వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సన్నవడ్ల సాగు చేసేలా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్శనలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కత్తి కనకయ్య, పాలకుర్తి పర్శరాములు, ఖమ్మం గణేష్, మానుపాటి పర్శరాములు, చెరుకు శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూరగాయల కొమురయ్య, పిల్లి కనకయ్య, వకలాభరణం శ్రీనివాస్, రంగు వెంకటేష్ గౌడ్, వంగ పరశు రాం, కదిరే రాజకుమార్, వేముల సతీష్, పండుగ ప్రదీప్, రోమాల ప్రవీణ్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన భగవద్గీత తరగతులు



**జనసైన్యం సిటి**

కరీంనగర్ గాంధీ రోడ్ లో ఉన్నటువంటి వైశ్య భవన్ నందు వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆరు నుండి 15 సంవత్సరాల వయసు గల సుమారు 50 మంది బాలబాలికలకు ఉచిత భగవద్గీత తరగతులు గత మాసం రెండవ తేదీ నుండి జూన్ నెల ఆరో తేదీ వరకు నిర్వహించడం ద్వారా భావిభారత పౌరులైన చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన జీవన నైపుణ్యాలు పెంపొందించడం సమగ్ర మూర్తివంతమైన సమాజాన్ని తయారు చేయడంలో మా వంతు పాత్రను పోషించి ప్రోత్సహించడం చాలా ఆనందదాయకంగా ఉందని ఉచితంగా భగవద్గీత నందలి 12వ 15వ అధ్యాయాలు నేర్పించిన అల్లాడి రాధిక కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ శాలువాతో గిఫ్ట్ తో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షులు చిదుర సురేష్, ప్రధాన కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, కోశాధికారి ముస్త్యాల రమేష్, కల్చరల్ అండ్ డివోషనల్ కోఆర్డినేటర్ నలుమాచు చంద్రశేఖర్, మరియు పాలకవర్గ సభ్యులు సన్మానించడంతోపాటు ప్రతిరోజు విద్యార్థిని విద్యార్థులను తీసుకురావటం తీసుకెళ్లడం బాధ్యతగా తీస్కోన్నటువంటి తల్లిదండ్రులను అభినందించారు. సన్మాన గ్రహీత అల్లాడి రాధిక మాట్లాడుతూ ఈ వేసవి సెలవులలో ఉచితముగా చిన్నారులకి నేర్పించే సువర్ణవకాశం కల్పించిన వైశ్య సేవాకేంద్రం పాలక వర్గానికి ధన్యవాదములు తెలియచేశారు. తదనంతరం పాల్గొన్న ప్రతి ఒక్క బాల బాలికలకు గిఫ్ట్ లను అందించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం ఉపాధ్యక్షులు ఎల్గూరి రవి, జాయింట్ సెక్రెటరీ పల్లెర్ల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిడి శ్రీధర్, కుట్టు మిషన్ కోఆర్డినేటర్ కైలాస నవీన్, విద్యా కమిటీ కోఆర్డినేటర్ కొండ రాంబాబు, డైరెక్టర్ పోకల లక్ష్మీనారాయణ , జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షులు జీడిగె సాయికృష్ణ, బాల బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కరీంనగర్ లయన్స్ నేత్ర వైద్యశాలకు మూడు అంతర్జాతీయ ఐఎస్ఓ ధృవపత్రాలు



**జనసైన్యం సిటి**

రేకుర్తిలోని లయన్స్ నేత్ర వైద్యశాలకు నాణ్యత, పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన నిర్వహణ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు అంతర్జాతీయ ప్రమాణాలైన ISO 9001:2015 (Quality Management System), ISO 14001:2015 (Environmental Management System) మరియు ISO 50001:2018 (Energy Management System) ధృవపత్రాలను పొందింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ ఎం. ప్రకాష్ హాల్ల మరియు కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి , హైమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య చేతుల మీదుగా ఐఎస్ఓ ధృవపత్రాలను స్వీకరించారు. ఈ ధృవపత్రాల ప్రదానం ద్వారా కరీంనగర్ లయన్స్ నేత్ర వైద్యశాల రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో తమ నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యంవారు వైద్యులను, సిబ్బందిని మరియు సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు.

## మయూర హోటల్ పార్కింగ్ స్థలంగా మారిన రోడ్డు




కరీంనగర్ నగరంలోని బస్టాండ్ ఎదురుగా గల మాయర హోటల్ పార్కింగ్ స్థలం లేక రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్న పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు.

## ఘనంగా కాల్వ నరసన్న యాదవ్ 62వ జయంతి వేడుకలు




స్వర్గీయ శ్రీ కాల్వ నరసన్న యాదవ్ 62వ జయంతి వేడుకలు అఖిల భారత యాదవ మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మంచాల రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా యాదవ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించబడినవి.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మంచాల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ , స్వర్గీయ కాల్వ నరసన్న యాదవ్ యాదవ సమాజ అభ్యున్నతి, సంఘ ఐక్యత మరియు సామాజిక సేవలో చేసిన విశిష్ట కృషిని స్మరించుకున్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, జిల్లా యాదవుల ఐక్యతకు, సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. జిల్లా సంఘం చీఫ్ అడ్వైజర్ బోయిన పోచమల్లు యాదవ్ మాట్లాడుతూ, కాల్వ నరసన్న యాదవ్ గారు కేవలం యాదవ సంఘానికే కాకుండా ఇతర సామాజిక సంఘాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ సేవలందించి, అనేక సంఘాలకు గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. వారి సేవలు చిరస్మరణీయమని, యువత వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందబోయిన ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, స్వర్గీయ కాల్వ నరసన్న యాదవ్ కల అయిన జిల్లా యాదవ సంఘ భవనం నిర్మాణం కోసం వారు చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. యాదవుల ఐక్యత, సంఘ బలోపేతం మరియు సామాజిక పురోగతికి ఆయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. జిల్లా కమిటీ, పట్టణ కార్పొరేషన్ కమిటీ సభ్యులందరూ కలిసి వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం కాల్వ నరసన్న యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో కాల్వ నరసన్న యాదవ్ సతీమణి శ్రీమతి లక్ష్మీ , జిల్లా సంఘ వ్యవస్థాపకులు మంచాల పోచన్న యాదవ్ , గౌరవ అధ్యక్షులు దుండ్ర రాజయ్య యాదవ్ , జిల్లాలి ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లేశం యాదవ్ , గోకుల ట్రస్ట్ చైర్మన్ బబ్బూరి కుమార్ యాదవ్ , బండి మల్లన్న యాదవ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సందబోయిన గీతాంజలి యాదవ్ గారు, చెర్ల పద్మ యాదవ్ గారు, కురుమ సంఘ నాయకులు కడారి ఐలయ్య , చిగుర్ల శ్రీనివాస్ , గంగారాం యాదవ్ ,లిసంఘ నాయకులు శ్రీనివాస్ యాదవ్ , 8వ డివిజన్ అధ్యక్షులు లివేల్పుల కొమురయ్య యాదవ్ , సందబోయిన రాజేశం యాదవ్ , 4వ డివిజన్ నాయకులు రాజు యాదవ్ , జిల్లా యువజన అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యాదవ్ , పట్టణ అధ్యక్షులు దాడి శంకర్ యాదవ్ , ఉపాధ్యక్షులు జిట్ట వేణి పరుశురాములు యాదవ్ , బొలవేణి సంతోష్ యాదవ్ కొమ్ము రవి యాదవ్ ముక్కర ప్రణయ్ యాదవ్ ,రాధారపు కుమార్ యాదవ్ , బొలవేణి శేఖర్ యాదవ్ , బాకారం శ్రీనివాస్ యాదవ్ , మేకల శేఖర్ యాదవ్ , మెండు రాజు యాదవ్ , ట్రెజరర్ చుక్కల వేణు యాదవ్ , మారం రవి యాదవ్ , జంగ శీను యాదవ్ , భాకరపు సాయి అక్షయ్ యాదవ్ తదితరులు పాల్గొని కాల్వ నరసన్న యాదవ్ కి ఘన నివాళులు అర్పించారు. "సమాజ సేవే ధ్యేయంగా, యాదవుల ఐక్యతే లక్ష్యంగా పనిచేసిన కాల్వ నరసన్న యాదవ్ ఆశయాలు చిరస్థాయిగా నిలిచి, భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి" అని నాయకులు పేర్కొన్నారు.

# పదేళ్లు అధికారంలో ఉండి ఏం పీకిండ్రు..?

## బీజేపీకి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూటి సవాల్



**జనసైన్యం సిటి**

మంచిర్యాల అభివృద్ధిపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ చేసిన వ్యాఖ్యలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఘాటుగా స్పందించారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెద్దపల్లి పార్లమెంట్ పరిధి, మంచిర్యాల జిల్లాకు ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు."పదేళ్లు అధికారంలో ఉండి ఈ ప్రాంతానికి ఒక్క పెద్ద ప్రాజెక్టు అయినా తీసుకొచ్చారా? అభివృద్ధి గురించి మాట్లాడే ముందు మీ పనితీరు ఏమిటో ప్రజలకు వివరించండి" అంటూ బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు.అభివృద్ధి చేసే దమ్ము లేకపోయినా, ఇతరులు అభివృద్ధి చేస్తే ఓర్చుకోలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను పార్లమెంట్‌లో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తూ ప్రాంతానికి నిధులు, ప్రాజెక్టులు సాధిస్తున్నానని పేర్కొన్నారు."కార్పొరేట్ కంపెనీలు నడపడం కాదు... మంచిర్యాల అభివృద్ధి కోసం ఎప్పుడైనా కేంద్ర మంత్రులను, అధికారులను కలిశారా?" అని ప్రశ్నించారు. తాను చేస్తున్న కృషి ఫలితంగానే పలు అభివృద్ధి పనులు పురోగతి సాధిస్తున్నాయని స్పష్టం చేశారు.తన తాత కాకా వెంకటస్వామి, తండ్రి వివేక్ వెంకటస్వామి చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు తనను ఆశీర్వదించారని, అదే కొందరు బీజేపీ నాయకులకు అసహనంగా మారిందని విమర్శించారు."దమ్ముంటే ఒక ఎన్నిక గెలిచి చూపించండి... ఒక పెద్ద ప్రాజెక్టు తీసుకొచ్చి చూపించండి... ఆ తర్వాత విమర్శలు చేయండి" అంటూ సవాల్ చేశారు. ప్రెస్‌మీట్లు, విమర్శలతో కాలక్షేపం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టాలని, ఎన్నికల సమయంలో రాజకీయాలు చేయొచ్చుగానీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు. చివరగా, "సొల్లు కబుర్లు ఆపి అభివృద్ధిపై ఫోకస్ చేయండి.. ప్రజల సంక్షేమమే మా లక్ష్యం" అంటూ బీజేపీ నాయకులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ప్రజలను కుక్కల బారి నుండి కాపాడండి.



**జనసైన్యం సిటి**

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్ హనుమాన్ నగర్, కోతిరాంపూర్, తిరుమల నగర్, బాలాజీ నగర్, కట్ట రాంపూర్ ప్రజలను కుక్కల బారి నుండి కాపాడాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు కోరారు. కరీంనగర్ నగరంలోని KES గార్డెన్లో జరిగిన ప్రజా పాలన సభలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయి కి సిపిఐ నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూ 40 డివిజన్లో ఎక్కడబడితే అక్కడ పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేస్తూ దారి వెంబడి వెళ్లే పాదాచారులపై, వాహనదారులను వెంబడించి ఎగబడుతూ గాయాల పాలు చేస్తున్నాయని కుక్కల వల్లదినదినం ప్రాణ గండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.కుక్కలు రోడ్డుపై వెళ్తున్నటువంటి వాహనదారులు,పాదాచారు లను,చిన్నపిల్లలను వెంబడించి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పదుల సంఖ్యలో రోడ్లపై ఉండి మూకుమ్మడిగా దాడి చేస్తూ గాయాల పాలు చేస్తూ న్నాయని ఆరోపించారు.వీధి కుక్కలను ఏరి వేయుటకు మున్సిపల్ నుండి నిధులు కేటాయించి ప్రతి వీధిలో ఉన్న కుక్కలను వెంటనే వేరే సురక్షితప్రాంతాలకు తరలించాలని పాఠశాల ప్రారంభాలకు సమయం దగ్గర పడుతున్నందున పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటేనే భయాందోళనకు గురయ్యే ప్రమాదం ఉందని గతంలో చాలామంది కుక్కల దాడులకు గురి అయి ఆసుపత్రుల పాలయ్యారని, కుక్కలు కరిస్తే అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వెంటనే మున్సిపల్ అధికారులు 4ా డివిజన్ సందర్శించి కుక్కలను ఏరిపారియాలి అని అన్నారు. ఈ వినతి పత్ర సమర్పణ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రమేష్,సంపత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు




జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ స్టీల్ బ్యాంక్ నిర్వహణ బాధ్యతను శ్రీ వినాయక మహిళా సంఘం వారికి అప్పగించారు .స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు శ్రీ వినాయక మహిళా సంఘం వి ఓ త్రివేణి వద్ద అందుబాటులో ఉంటాయని గ్రామ సర్పంచ్ బండి రాజేష్ తెలిపారు.ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యవరణం రక్షణ లో బాగాంగ ప్లాస్టిక్ నిషేధం చేస్తు మీ ఇంట్లో జరిగే శుభకార్యాలకు, అశుభ కార్యాలకు శ్రీ వినాయక మహిళా సంఘం వారిని సంప్రదించి స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు పండుగలు కావచ్చు, ఇతర కార్యక్రమాలు కావచ్చు - మీ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్లాస్టిక్ నిషేధానికి గ్రామ పంచాయతీకి సహకరించాలని,ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా గ్రామ పంచాయతీ తరఫున ఈ స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశామన్నారు.రేపటి నుండి కిరాణా షాపులలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మినా, మీ శుభ, అశుభ కార్యక్రమాలలో వినియోగించినా కచ్చితంగా 5 వేలు రూపాయల జరిమానా విధించబడుతుందన్నారు.మన అందరి ఆరోగ్యాన్ని, మన పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేస్తున్న కార్యక్రమం. ప్రతి ఒక్కరూ దీనికి బాధ్యతగా సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ ఓంకారి లక్ష్మణ్,వార్డుల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బొద్దింకల తిరుగుబాటు: ఢిల్లీ నుంచి దేశానికి యువత సందేశం



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.

జూన్ 6, 2026న ఢిల్లీలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన దేశ రాజకీయాల్లో, సోషల్ మీడియాలో, యువత చర్చల్లో ఒక ముఖ్యమైన ఘటనగా మారింది. కొన్ని వారాల క్రితం సోషల్ మీడియాలో వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైన ఈ ప్రచారం, ఇప్పుడు వేలాది మంది యువకులు ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యమంగా రూపాంతరం చెందింది. నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, ప్రభుత్వ బాధ్యత, యువత భవిష్యత్తు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా పేరుకుపోయిన అసంతృప్తి ఈ నిరసనలో స్పష్టంగా కనిపించింది.




ఈ ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే అమెరికా నుంచి ఈరోజు ఢిల్లీకి చేరుకున్నారు. మొదట ఆయన అనుచరులను విమానాశ్రయానికి రావాలని పిలుపునిచ్చినా, తర్వాత భారీ జనసందోహం ఏర్పడే అవకాశం ఉందని భావించి విమానాశ్రయానికి రావద్దని కోరారు. ప్రజలకు, భద్రతా సిబ్బందికి ఇబ్బందులు కలగకూడదని ఆయన చేసిన విజ్ఞప్తి సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వచ్చింది. అయినప్పటికీ, ఢిల్లీ విమానాశ్రయం నుంచి జంతర్ మంతర్ వరకు భద్రతా ఏర్పాట్లు అసాధారణంగా కనిపించాయి. ఢిల్లీ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. విమానాశ్రయం నుంచి దిప్కే కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగింది. కొన్ని రోజులుగా ఆయన అరెస్టు కావచ్చనే ప్రచారం జరిగినప్పటికీ, ఆయన ఢిల్లీ చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొదట సోషల్ మీడియాలో "ఇండియా గేట్ నిరసన"గా ప్రచారం జరిగినప్పటికీ, అధికారికంగా అనుమతి పొందిన ప్రదేశం జంతర్ మంతర్. ఉదయం నుంచి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ సమీపంలో యువత గుమికూడడం ప్రారంభమైంది. తరువాత వారు జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లింపులు చేశారు. రాజధానిలోని అనేక రహదారులపై ప్రత్యేక ఆంక్షలు విధించబడ్డాయి.

ఈ సభలో ప్రధానంగా వినిపించిన డిమాండ్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనేదే. నీట్ సహా పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలు, నియామక ప్రక్రియల్లో పారదర్శకత లేకపోవడం, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ నియామక వ్యవస్థను పారదర్శకంగా మార్చాలని డిమాండ్ చేశారు.

సభలో పాల్గొన్న యువకులు తమ చేతుల్లో జాతీయ జెండాలు, పుస్తకాలు, డాక్టర్.బీ.ఆర్. అంబేద్కర్ ఫొటోతో ఉన్న ప్లకార్డులు పట్టుకుని కనిపించారు. కొందరు బొద్దింకల ముసుగులు ధరించి వ్యంగ్య నిరసన చేపట్టారు. "మాకు ఉద్యోగాలు కావాలి", "పరీక్షల్లో న్యాయం కావాలి", "యువత చెప్పేది వినండి", "ప్రశ్నించడం నేరం కాదు" వంటి నినాదాలు వినిపించాయి. ఉద్యమ నాయకత్వం మొత్తం కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని పదేపదే పిలుపునిచ్చింది.

ఈరోజు సభకు పర్యావరణ కార్యకర్త సోను వాంగ్ చుక్ మద్దతు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో యువత స్వరం వినిపించడం ఆరోగ్యకరమైన పరిణామమని వ్యాఖ్యానించినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి.


సభలో అభిజీత్ దిప్కే చేసిన ప్రసంగం కూడా చర్చనీయాంశమైంది. "అవసరమైతే నా స్వేచ్ఛను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని ఆయన ప్రకటించారు. సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేయడం, ఒత్తిళ్లు తేవడం, విమర్శలు చేయడం ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని ఆయన అన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి ఉద్యమం కాదని, లక్షలాది మంది యువత ఆవేదనకు ప్రతీక అని పేర్కొన్నారు.

మీడియా కవరేజీ పరంగా చూస్తే, దేశీయ మీడియా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రసారం చేసింది. కొన్ని మీడియా సంస్థలు దీనిని యువత అసంతృప్తికి ప్రతీకగా చిత్రీకరించగా, మరికొన్ని దీనిని సోషల్ మీడియా ఆధారిత వ్యంగ్య రాజకీయ ప్రయోగంగా అభివర్ణించాయి. అధికార పక్షానికి అనుకూలంగా భావించే కొన్ని వేదికలు (గోదీ మీడియా) ఉద్యమ ప్రాముఖ్యతను తగ్గించి చూపడానికి ప్రయత్నించగా, స్వతంత్ర మీడియా సంస్థలు దీనిని యువత ఆవేదన ప్రతిబింబంగా విశ్లేషించాయి.

అంతర్జాతీయ మీడియా స్పందన కూడా గమనించదగ్గది. అంతర్జాతీయ సంస్థలు ఈ ఉద్యమాన్ని ప్రత్యేక కథనాలుగా ప్రచురించాయి. సోషల్ మీడియా వ్యంగ్య ప్రచారం ఎలా వీధి నిరసనగా మారిందో అవి వివరించాయి. భారత యువతలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థపై అసంతృప్తి, రాజకీయ నిరాశ వంటి అంశాల నేపథ్యంలో ఈ ఉద్యమాన్ని విశ్లేషించాయి.

ప్రభుత్వ వర్గాలు, భారతీయ జనతా పార్టీ నాయకులు మాత్రం ఈ ఉద్యమ రాజకీయ ప్రభావాన్ని తక్కువ చేసి చూపేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావడం ఒకటి, వాస్తవ రాజకీయ శక్తిగా మారడం మరొకటి అని పేర్కొన్నారు. అయితే రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ ఉద్యమం ఎన్నికల రాజకీయాలను వెంటనే ప్రభావితం చేయకపోయినా, యువత అసంతృప్తిని బహిర్గతం చేయడంలో విజయవంతమైంది.

ఈరోజు జంతర్ మంతర్ సభ ముగిసే సమయానికి ఒక విషయం స్పష్టమైంది. కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్తులో రాజకీయ పార్టీగా మారుతుందా లేదా అనేది పక్కన పెడితే, యువతలో పేరుకుపోయిన ఆవేదనను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకురావడంలో మాత్రం ఇది సఫలమైంది. బొద్దింక అనే అవమానకర పదాన్ని నిరసన చిహ్నంగా మార్చి, సోషల్ మీడియా మీమ్స్‌ను వీధి ఉద్యమంగా మలిచిన ఈ ప్రయోగం భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయంగా నిలవవచ్చు. జంతర్ మంతర్‌లో వినిపించిన నినాదాల వెనుక అసలు సందేశం ఒక్కటే --- "యువతను వినండి, వారి భవిష్యత్తును నిర్లక్ష్యం చేయవద్దు."


Hello... SULTANABAD
Now Neha Concept High School
Under the management of
Siddartha
GROUP OF SCHOOLS
EMPOWER. INSPIRE. ACHIEVE
IVY
CBSE
HIGH SCHOOL
Narsaiahpalli, Mndl: SULTANABAD, Peddapalli District
90633 69083
30 YEARS OF EXCELLENCE SIDDARTHA
ADMISSIONS OPEN 2026 - 27 Day & Residential
Sripal Reddy Dasari
Chairman
K.VISHWAKSEN
TELANGANA STATE 6th RANK
TOP SSC MARKS 592 /600
KARIMNAGAR DISTRICT 1st RANK
TOTAL STRENTH - 452
ABOVE 570 MARKS - 31
ABOVE 550 MARKS - 122
ABOVE 500 MARKS - 306
30 YEARS OF EXPERIENCE
ACADEMIC EXCELLENCE
IIT FOUNDATION
TRANSPORT
RESIDENTIAL
BHAGATHNAGAR 92906 69083
MANKAMMATHOTA 9205 69083
CHOPPADANDI 91778 69083
VIDYANAGAR 99128 69083
IVY CBSE HIGH SCHOOL 90946 12222

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో షర్మిల



**జనసైన్యం సిటి**

కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన షర్మిల శనివారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షర్మిల జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. కాగా, షర్మిల శనివారం కరీంనగర్ ఆర్డీవోగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామసభలతో ప్రజా సమస్యలు పరిష్కారం




**జనసైన్యం సిటి**

పచ్చదనం , పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని.. గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారమవుతాయని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పైపులైన్ల మరమ్మత్తులు, ఓ నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. పచ్చదనం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం వంటి వంటి చిన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన గ్రామాలే జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు , వసతులను సద్వినియోగం చేసుకొని సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నిబంధనల మేరకు చెత్త నిర్వహణ చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బడిబాట గురించి వివరించారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ సర్ లో భాగంగా ఓటరు నమోదు జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**జనసైన్యం సిటి**

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని బిజెపి కార్పొరేటర్లు తోట అనిల్, కే . పి.చంద్ర , తుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు మా కే నామ్ ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు నాటడం ) ప్రోగ్రాం ను శనివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్లోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి వృక్షోత్పత్తి ఒక్కటే మార్గమన్నారు.

డివిజన్‌లోనూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో నిరంతరం శ్రమిస్తాయని, రాబోయే రోజుల్లో మరిన్ని పర్యావరణ కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు."మొక్కలు నాటడం అనేది ఒక రోజు కార్యక్రమం కాదు, అది ఒక నిరంతర ప్రక్రియ. నాటిన ప్రతి మొక్కను వృక్షంగా మార్చే వరకు కాలనీ కమిటీలు, ప్రజలు బాధ్యత తీసుకోవాలనీ కోరారు. రాబోయి వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాలలో వివిధ రకాల నీడను ఇచ్చే, పూల మొక్కలను నాటాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాల ప్రచార కార్యక్రమం




తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన లిప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక)లిలో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), కరీంనగర్‌లో జూన్ 6 నుండి 12 వరకు ప్రత్యేక ప్రవేశాల ప్రచార కార్యక్రమం (Enrollment Drive) నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల్లో ఉన్నత విద్య పట్ల అవగాహన పెంపొందించడం, కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను విస్తృతంగా ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలకు విశేష స్పందన లభించిందన్నారు. ఇప్పటికే 1000 మందికి పైగా విద్యార్థినులు డోస్ట్ (DOST) ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసి కళాశాలలో ప్రవేశాలు పొందినట్లు వెల్లడించారు. కళాశాలలో ఉన్న నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, విశాలమైన గ్రంథాలయం, సురక్షితమైన వసతి గృహాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు కెరీర్ మార్గదర్శక సేవలు విద్యార్థినులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు.మహిళా విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఈ కళాశాల రాష్ట్రంలోనే ప్రముఖ విద్యాసంస్థగా గుర్తింపు పొందిందని, వివిధ జిల్లాల నుండి విద్యార్థినులు ఇక్కడ చేరుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థినుల సమగ్రాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు మరియు మహిళా సాధికారత లక్ష్యంగా కళాశాల అనేక వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అర్హత కలిగిన విద్యార్థినులు కొనసాగుతున్న ప్రవేశ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చేరాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డా. జి. శ్రీనివాస్ రెడ్డి, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కోఆర్డినేటర్ శ్రీమతి పి. స్వరూప, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎన్. మనోజ్ కుమార్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డా. బి. రజని దేవి, శ్రీ కె. సతీష్ కుమార్, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు.



**జనసైన్యం సిటి**

కరీంనగర్.. భగత్ నగర్ లోని చైతన్య యూత్ క్లబ్ లో శనివారం జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 9 చదరంగం పోటీలలో జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు బాలికల విభాగంలో ఎం .సాన్విత, జీ.తాన్వి, ఎన్ .సాన్విత, ఎల్ ,అద్వైత బాలుర విభాగంలో హీమాన్స్ రావు , కె. స్నితిక్ రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూడా గెలుపొంది జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 14 నుండి 16 వరకు హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి చరంగం పోటీల్లో ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు కంకటి సృజన కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, కోచ్ అభిరాం తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్‌లోని అన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



**జనసైన్యం సిటి**

తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక-1 ప్రత్యేక అధికారి, రిటైర్డ్ జడ్జి ఎస్.వి. వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో కరీంనగర్ టవర్ సర్కిల్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో చా×వీ×వీ కరీంనగర్ టౌన్ అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సాబ్ ఆదేశాల మేరకు ఎంఐఎం టౌన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు అన్నెమల్ల సురేష్ వినతిపత్రం సమర్పించారు.నగరంలోని అన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రతా పరమైన రక్షణ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఫెన్సింగ్‌పై సంబంధిత శాఖ ఉద్యోగి పేరు, హోదా, ప్రభుత్వ మొబైల్ నంబర్‌తో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ సంబంధిత సమస్యలను ప్రజలు నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ యాప్ ద్వారా విద్యుత్ ఫిర్యాదులు నమోదు చేయడం, ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన వైర్లు, ఇతర ప్రమాదకర పరిస్థితుల ఫోటోలను అప్లోడ్ చేసి ఫిర్యాదు చేసే సదుపాయం కల్పించాలని కోరారు. ప్రజల భద్రత, పారదర్శకత, బాధ్యతాయుత సేవల కోసం ఈ సూచనలను అమలు చేయాలని ఆయన ఎన్‌పీడీసీఎల్ అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఎంఐఎంనాయకులు షకీలోద్దీన్ పాల్గొన్నారు.